# ఋణానందలహరి

ఎనిమిదేళ్ళనించి ఉన్నాను ఈ వూళ్ళో. ఐతే నిన్న బ్యాంక్ ఆఫీసర్లు సన్మానం చేసేదాకా నాకూ ప్రయోజకత్వం వుందని మా ఆవిడకి అనిపించలే నట్టుందెప్పుడూనూ.

ఉద్యోగం లేదు నాకు. అయితే, విరివిగా "సాహిత్య సేవ" చేయగలగడాన్ని, భృతికి పెద్ద లోటుగా ఎప్పుడూ బాధపడలేదు. ప్రతి నెలా "నాలుగు రచనలు" అచ్చేసుకుని తృణం కాదు, పణమే ముట్ట చెబుతున్నారు పత్రికలవాళ్ళు. ఏటా నాలుగు నవలలు నాలుగువేలు తెస్తాయి. ఇవన్నీకాక, ఏడాది కొకసారైనా ఏదో బహుమతి వస్తుంది. మా యింట్లో ఎవరిపేరో పెట్టి రాసిన కథకో నవలకో—

"కుర్రాడు సైకిలు కావాలంటున్నాడు. పాపాయి రేడియో అంటోంది. బ్యాంకువాళ్లు ఓ వెయ్యి అప్పిస్తారేమో అడగరాదూ?" అంటూ మా ఆవిడ పొద్దున్నే క్లాసు పెట్టింది.

నిజానికి, బ్యాంకువాళ్ళు నాకు చూపించిన ఆదర మర్యాదలు ఇంతా అంతా కావు. సాక్షాత్తూ జనరల్ మేనేజరు (బొంబాయినుంచొచ్చినాయన) నా సన్మాన సభకి అధ్యక్షత వహించి, నా మెళ్ళో దండవేసి, గిల్టు అక్షరాలతో అచ్చువేసి రెండువేపులా అద్దంతో ఫొటో కట్టించిన సన్మాన పత్రం నా కందించి, నాతోపాటు ఫొటో దిగారు. ఈవూరి ఏజంటుగారు సన్మాన పత్రం చదివేరు. అప్పుల డిపార్ట్ మెంట్ సీనియర్ ఆఫీసరు నా రచనా వ్యాసంగాన్ని గురించి కూలంకషంగా చర్చించారు. నా గురించి పరిచయ వాక్యాలు చదువుతూ కూడా కప్ప దాట్లు వేసి, నన్ను మెచ్చుకున్నాయన చీఫ్ కేషియరు.

వెళ్ళాను, ఐదారుమంది నమస్కారాలు పెట్టారు. ఒకతను నాతో మాట్లాడుతూ పనిమీద దృష్టి నిలపడం మానాడు. అందుచేత "లోను" విషయం అతనితో అన్నాను. ఎవర్నో అడిగి, ఫారంతెచ్చి "ఇది నింపండి" అని పనిలో పడ్డాడు.

నింపాను.

''ఆ హాల్లో మధ్యని కూర్చున్నాయన కివ్వండి'' అన్నాడు.

పొడిగా ఇచ్చాను. తను అందుకున్న ఫారం చూసీ చూడగానే మొహం చిట్లించి, "కూర్చోండి" అన్నాడాయన, బలాత్కారంగా అంటున్నట్టు.

"మీరేం చేస్తుంటారు ?" అడిగాడు.

"రచనలు" అనిచెప్పి; "నిన్న మీ బ్యాంకువారు సన్మానం చేసింది నాకేనండీ" అన్నాను నవ్వుతూ.

"అదిసరే 'జాబ్' ఏమీ లేదా ?"

"కొన్నొర పత్రికవారు నవల రాయమన్నారు. నెలవంక వారు ఫీచర్ రాయిస్తున్నారు."

"అదికాదు. నెలకింత జీతమూ అని ఇచ్చే వుద్యోగం మాట అడుగుతున్నాను !"

"ఏం లేదండి."

"మరి అప్పుచేస్తే ఎలా తీరుస్తారు ?"

"రచనలమీద వొచ్చే ఆదాయంతోనే."

"ఒకవేళ ఆదాయం లేకపోతేనో ?"

"లేకుండా ఎన్నడూ వుండదు."

"అలా అని ఎవరయినా సర్టిఫై చెయ్యగలరా ?"

"రాస్తే తప్పకుండా డబ్బు పంపిస్తారు. ఒక్కొక్కప్పుడు ఎడ్వాన్సు తీసుకుని మరీ మొదలెడతాను రాయడం. అయితే, మీరు అడిగిన విధంగా సర్టిఫై చెయ్యరనుకుంటా నెవ్వరూనూ" అన్నాను.

"ఏడాదికి ఎంత ఆదాయం వుంటుంది ?"

"ఏడెనిమిది వేలుంటుంది, ఈ ఏడాది పదివేలు దాటుతుంది."

"పోనీ, అలా అని ఎవరైనా రాసివ్వగలరా ?"

"ఇవ్వలేరు. ఎందుకంటే; ఏ సంస్థకూడా వెయ్యికి మించి ఇవ్వదు నాకు." ఆయన తృప్తిపళ్ళేదు. "సరే, రండి! ఏజెంటుగారితో మాట్లాడదాం." వెళ్ళాం. నన్ను చూడగానే బెల్ కొట్టి కాఫీలు ఆర్డర్ చేశారాయన. "నిన్న మీటింగులో మిమ్మల్ని బాగా శ్రమపెట్టాం?" అన్నారు.

అసలు విషయం కదిలింది. ఎలాగయితేనేం, కొంతసేపటికి ఆయన కూడా "సెక్యూరిటీ" కావాలన్నారు. "జనహంస"లో సీరి

యల్‌గా వస్తున్న నవల ఆఫర్ చేశాను. ఆయన చిరునవ్వు నవ్వి, "అలాంటివి తీసుకోకూడదండీ, క్షమించాలి. మాకు కొన్ని రూల్సుంటాయికదా'' అన్నారు. నేనేం అన్లేదు. "రచనను వృత్తిగా భావించలేం'' అని వృత్తుల లిస్టు చూపించారు. అందులో నా వృత్తిలేదు.

"ఇంతకీ ఎందుకు, మీకీ అప్పు?''

"నా నవల అచ్చు వేసుకుంటాను.''

"అలాంటివాటికి అప్పు లివ్వకూడదు.'' అన్నారాయన మళ్ళీ చిరునవ్వుతోనే.

నాకు తెలిసిపోయింది. కిళ్ళీ కొట్టుకి యిస్తారు. కాఫీ దుకాణానికి యిస్తారు. ఆటోరిక్షా కొనుక్కోడాని కిస్తారు. మొబైల్ లైబ్రరీకి కూడా యిస్తారు. రచయితల కివ్వరు.

"మీ అడ్రసు ఇచ్చి వెళ్ళండి; చూస్తాం!'' అన్నారు ఏజెంటుగారు. ఎవరికో టెలిఫోన్ చెయ్యడానికి వుద్యమిస్తూ. (నా అడ్రసు వాళ్ళదగ్గర ఇదివరకే వుంది. లేకపోతే నన్ను సన్మానించడానికి ఎలా పిలిచారు? - అనుకున్నాను.)

"మీకు మొదట్నించీ యిష్టంలేదు; అప్పు చేయడం'' అని సాధించింది మా ఆవిడ నేను ఇంటికెళ్ళగానే.

"ఇష్టం లేకపోవడంకాదు. నాకు తెలుసు; వాళ్ళ రూల్సులోగాని, మరెవ్వరి రూల్సులోగాని, రచయితలు కూడా మామూలు మనుషులేననీ; రచన కూడా వృత్తేననీ చెప్పేవి ఉండవని.''

"మరెందుకు వెళ్ళారు?''

"సరదాకి.''

"ఏమిటో ఆ సరదా?''

"పదహారు వందల కోట్ల రూపాయల ఎస్సెట్సున్న బ్యాంకు; మర్యాదగా ఏడాదికి పదివేలు సంపాదించుకునే వ్యక్తికి వెయ్యి రూపాయలు అప్పివ్వ లేకపోతే చూడ్డం? వినోదించడం నాకు సరదా. కాదంటావా?'' అన్నాను.

మా ఆవిడ కాదన్లేదు—

(23-9-78)